సాక్షి విజయనగరం

సోమవారం । 14 । ఆగస్టు । 2023



వర్ధమాన క్రికెటర్లకు ఏపీఎల్ తొలిమెట్టు

ఏపీఎల్ సీజన్–2 క్రికెట్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజు కోరారు. - 8లో



హైరిస్క్ గర్భిణులకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు..

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా హెచ్ఆర్‌పీ(హైరిస్క్ గర్భిణీ)లను ఆస్పత్రికి తీసుకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుస్తారు. - 8లో



ఆర్టీసీలో అప్రెంటిస్

సాంకేతిక (ఐటీఐ) విద్యార్హతతో అప్రెంటిస్ శిక్షణ అందించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆర్టీసీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. - 8లో

న్యూస్‌రీల్

700 క్యూసెక్కుల నీరు విడుదల



కుడి కాలువ ద్వారా విడుదలవుతున్న నీరు

వంగర: మండల పరిధిలోని మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు కుడి ప్రధాన కాలువ ద్వారా 700 క్యూసెక్కుల నీరు ఆయకట్టు భూములకు అధికారులు సరఫరా చేస్తున్నారు. రేగిడి, సంతకవిటి, జి.సిగడాం మండలాల్లో ఉభాలు ముమ్మరంగా జరుగుతుండడంతో ప్రాజెక్టు అధికారులు పూర్తి స్థాయిలో నీటిని విడిచిపెడుతున్నట్లు ఏఈ నితిన్ వెల్లడించారు.

పంద్రాగస్టు వేడుకలకు మహిళ ఎఫ్‌పీవోకు ఆహ్వానం

సీతంపేట: ఢిల్లీలో ఎర్రకోట ప్రాంగణంలో జరగనున్న పంద్రాగస్టు వేడుకలకు ఆదివాసీ మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీకి ఆహ్వానం అందినట్టు ఆర్ట్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా చీడిమానుగూడ గ్రామానికి చెందిన ఎఫ్‌పీఓ చైర్మన్ సవర లలితకుమారి, సీఈఓ ఆరిక గౌతమి హాజరు కానున్నారన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రితో ఈ ప్రాంతంలో పండుతున్న అటవీ ఉత్పత్తులు, వాటికి కల్పిస్తున్న మద్దతు ధరలపై వివరించనున్నట్టు ఎఫ్‌పీఓ లలితకుమారి తెలిపారు.

నేడు హోం మంత్రి రాక



హోం మంత్రి తానేటి వనిత

పార్వతీపురం టౌన్: రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత సోమవారం జిల్లాకు వస్తున్నారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు పార్వతీపురంలో స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారు. రాత్రికి పార్వతీపురంలో బస చేసి మంగళవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 12.30 గంటలకు పార్వతీపురం నుంచి బయలుదేరి వెళ్తారు.

సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

పాలకొండ: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆదివారం తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలు నేరుగా స్పందనలో తెలియజేయవచ్చునని వివరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు అర్జీలు స్వీకరిస్తామని తెలిపారు.

మహిళల బైక్ ర్యాలీ

పార్వతీపురం టౌన్: నా నేల – నా దేశం కార్యక్రమంలో భాగంగా మహిళలతో బైక్ ర్యాలీ సోమవారం నిర్వహించనున్నట్టు డీఆర్‌ఓ జె. వెంకటరావు ఆదివారం తెలిపారు. ఉదయం 7 గంటలకు సెయింట్ పీటర్స్ పాఠశాల నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఆరోగ్యశ్రీతో పునర్జన్మ



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు మూనురు నాయుడు. ఇతనిది జామి మండలం రామయ్య పాలేం గ్రామం. కొద్ది రోజుల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. దీంతో వారి కుటుంబ సభ్యులు విజయనగరంలో ఉన్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి అక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం అతను పూర్తిగా కోలుకున్నాడు. ఇతని వైద్యానికి ప్రభుత్వం రూ.90 వేలు ఖర్చు చేసింది. ఆరోగ్య ఆసరా కింద మరో రూ.10 వేలు అతనికి ప్రభుత్వం ఇచ్చింది. ఒక్క పైసా ఖర్చు కాకుండా వైద్యం జరగడంతో ఎంతో సంతోషిస్తున్నాడు.



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి మర్రాపు రామినాయుడు. ఇతనిది బొబ్బిలి మండలం అలజంగి గ్రామం. ఇతనికి కిడ్నీలో నొప్పి రావడంతో బొబ్బిలిలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యులు ఇతనికి ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాడు. ఇతని వైద్యానికి ప్రభుత్వం రూ.40 వేలు వెచ్చించింది. ఉచితంగా వైద్యం చేయడంతో ఎంతో ఆనందపడుతున్నాడు.



ఆరోగ్యశ్రీ హెల్ప్ డెస్క్



సర్వజన ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్న రోగులు

- నాలుగేళ్లలో 2,44,172 మందికి ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి
- వీరి వైద్యం కోసం ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తం రూ.479.95 కోట్లు
- ఆరోగ్యశ్రీ ద్వారా 3 వేలకు పైగా వ్యాధులకు చికిత్స
- అత్యధికంగా 43,580 మంది కంటి రోగులకు చికిత్స
- 43,235 మంది గైనిక్ రోగులకు చికిత్స

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం అనేక మందికి పునర్జన్మ ప్రసాదిస్తోంది. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చాలు కార్పొరేట్ ఆస్పత్రులు సైతం పిలిచి మరి వైద్యం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం ఉండడం వల్ల తమ ఆరోగ్యానికి కొండంత భరోసా ఉందని ప్రజలు భావిస్తున్నారు. వేలాది మంది ఏటా ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందుతున్నారు. గడిచిన నాలుగేళ్ల కాలంలో రెండు లక్షలకు పైగా ప్రజలు ఆరోగ్యశ్రీ పథకాన్ని వినియోగించుకున్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.479.95 కోట్లు వరకు వెచ్చించింది.

వైద్యం ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తింపు

వైద్యం ఖర్చు రూ.1000 దాటితే చాలు ఆరోగ్యశ్రీ వర్తిస్తుండంతో అధికశాతం మంది దీన్ని వినియోగించుకుంటున్నారు. గతంలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు ఆరోగ్యశ్రీ వర్తించేది కాదు. ప్రస్తుతం వాటికి కూడా ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తున్నారు. కేన్సర్, గుండె జబ్బులకు ఎన్ని రూ.లక్షలు ఖర్చు అయినా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా చేయిస్తోంది. గతంలో కేన్సర్, గుండె జబ్బులు వంటి పెద్ద జబ్బుల చికిత్స కోసం పేద, మధ్య తరగతి వర్గాల వారు అప్పుల పాలయ్యేవారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ అండగా ఉండడంతో ఆ బాధలు తప్పాయి.

3,257 వ్యాధులకు చికిత్స

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ప్రస్తుతం 3257 వ్యాధులకు చికిత్స అందిస్తున్నారు. 2019 వరకు కేవలం 1000 వ్యాధులకు మాత్రమే చికిత్స అందేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత 2,446 వ్యాధులకు పెంచారు. వాటికి అదనంగా మరో 811వ్యాధులను చేర్చారు. ప్రస్తుతం 3257 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందిస్తున్నారు. జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం కుటుంబాలు 7 లక్షలు ఉన్నాయి. జిల్లాలో అధికశాతం మంది పేద, మధ్య తరగతి ప్రజలు ఆరోగ్యశ్రీ కార్డు ఉండడంతో ఉచితంగా వైద్య సేవలు పొందుతున్నారు.

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌ఆస్పత్రులు

జిల్లాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, రెండు ప్రాంతీయ ఆస్పత్రులు, ఘోషాస్పత్రి, 5 సీహెచ్‌సీలు, 38 పీహెచ్‌సీలు, 16 ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉంది. అదే విధంగా పార్వతీపురం మన్యం జిల్లాలో జిల్లా ఆస్పత్రి, ఒక ఏరియా ఆస్పత్రి, రెండు ప్రైవేటు ఆస్పత్రులు, 3 సీహెచ్‌సీలు, 27 పీహెచ్‌సీల్లో ఆరోగ్యశ్రీ పథకం అమల్లో ఉంది.

2,44,172 మందికి లబ్ధి

గడిచిన నాలుగేళ్ల కాలంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 2,44,172 మంది లబ్ధి పొందారు. వీరి వైద్యానికి ప్రభుత్వం రూ.479.95 కోట్లు ఖర్చు చేసింది. వీటిలో ఎక్కువగా కంటి, పిల్లలు, గైనిక్, గర్భిణులు, ఎముకల సంబంధిత రోగులు చికిత్స పొందారు.

మరింత మందికి ఆరోగ్యశ్రీ



ఆరోగ్యశ్రీ పథకం ద్వారా సేవలు అందుకునే వారి సంఖ్య బాగా పెరిగింది. వైద్యం ఖర్చు రూ.1000 దాటితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుండడంతో అధిక శాతం మంది ఆరోగ్యశ్రీ సేవలను వినియోగించుకుంటున్నారు. నెట్‌వర్క్ ఆస్పత్రులు రోగులకు సకాలంలో వైద్య సేవలు అందించే విధంగా సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్



ఘోషాస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా శిశువులకు అందుతున్న చికిత్స

2019 నుంచి జూలై 2023 వరకు ఆరోగ్యశ్రీ ద్వారా అత్యధికంగా లబ్ధి పొందిన వారి వివరాలు

సర్జరీ కేటగిరి	రోగుల సంఖ్య	వెచ్చించిన నిధులు
గ్యాస్ట్రో ఎంట్రాలజీ	1033	రూ.3.77 కోట్లు
ఎపిడమిక్ డిసీజ్	9261	రూ.4.48 కోట్లు
జనరల్ మెడిసిన్	3359	రూ.4.94 కోట్లు
పిడియాట్రిక్	13,784	రూ.32.50 కోట్లు
నెఫ్రాలజీ	10,532	రూ.20.46 కోట్లు
కార్డియాలజీ	6423	రూ.21.28 కోట్లు
పలమనాలజీ	2544	రూ.7.12 కోట్లు
న్యూరాలజీ	3844	రూ.9.28 కోట్లు
జనరల్ సర్జరీ	3,780	రూ.30.13 కోట్లు
న్యూరో సర్జరీ	3524	రూ.17.51 కోట్లు
మెడికల్ అంకాలజీ	30,742	రూ.38.97 కోట్లు
సర్జికల్ అంకాలజీ	5355	రూ.17.12 కోట్లు
రేడియేషన్ అంకాలజీ	6004	రూ.42.35 కోట్లు
పాలిట్రామా	10,444	రూ.32.07 కోట్లు
ప్లాస్టిక్ సర్జరీ	628	రూ.3.18 కోట్లు
ఆప్తామాలజీ	43,580	రూ.33.78 కోట్లు
గైనిక్	43,235	రూ.51.48 కోట్లు
ఆర్థోపెడిక్	16,655	రూ.39.07 కోట్లు
కార్డియక్ సర్జరీ	5600	రూ.36.09 కోట్లు
జనరల్ యురినరీ సర్జరీ	8,311	రూ.20.87 కోట్లు

● 'పంద్రాగస్టు' విద్యుత్ కాంతులు



పంద్రాగస్టు వేడుకలకు అంతా సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో విజయనగరం రైల్వేస్టేషన్‌ను అధికారులు విద్యుత్ కాంతులతో సుందరంగా ముస్తాబు చేశారు. రెండు రోజుల ముందుగానే వేడుకలకు సర్వం సిద్ధం చేశారు. ప్రయాణికుల కళ్లు జిగేల్‌మనేలా వెలుగులు విరజిమ్ముతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

ఎన్ఎంఎంఎస్‌కు వేళాయె..

- మెరిట్ స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు
- తొమ్మిది నుంచి ఇంటర్ వరకూ ప్రోత్సాహకాలు
- ఏడాదికి రూ.12 వేల సాయం
- ఎనిమిదవ తరగతి విద్యార్థులు అర్హులు
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ
- సెప్టెంబర్ 15 వరకూ గడువు
- డిసెంబర్ 3న రాత పరీక్ష
- జిల్లాలో 230 నుంచి 250 మంది విద్యార్థులకు అవకాశం

రాజాం: బాగా చదవడంతో పాటు ఉన్నత చదువులు చదవాలనుకునే పేద విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిభ ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. ప్రతిభ ఉండి, ఆర్థిక సమస్యలు ఎదుర్కొనే విద్యార్థుల కోసం కేంద్ర ప్రభుత్వం నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) కింద ఆర్థిక చేయూతనిస్తోంది. ఈ పరీక్షల్లో రాణించేందుకు విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని ఇస్తుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ చదివే పేద విద్యార్థులకు ప్రతీ ఏడాది ఈ ఆర్థిక సాయం అందనుంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి (2023–24) ఎన్ఎంఎంఎస్ నోటిఫికేషన్ ఏపీ డైరెక్టరేట్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ విభాగం ఇటీవల విడుదల చేసింది.

ఏడాదికి రూ.12వేల సాయం

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12వేలను స్కాలర్‌షిప్ రూపంలో ప్రభుత్వం అందిస్తుంది. ఈ మొత్తం నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాల్లోకి వస్తుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ పూర్తి చేసే వరకూ ఈ ఉపకార వేతనం లభిస్తుంది. ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ ప్రతిభా ప్రోత్సాహకాల అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. ప్రతిభ చూపే వారికి సాయం అందుతుంది. ప్రతీ ఏడాది 230 నుంచి 250 మంది విద్యార్థులు ఈ ఉపకార వేతనాలకు అర్హత సాధిస్తున్నారు. వీరందరికీ నాలుగేళ్ల పాటు ఈ ఉపకార వేతనాలు అందుతున్నాయి.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

ఎన్ఎంఎంఎస్ ఉపకార వేతనాల పరీక్షకు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల 10 నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ అధికారిక వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తులను సమర్పించాలి. అనంతరం సంబంధిత ప్రింటవుట్లను, ధ్రువీకరణ పత్రాలను డీఈఓలకు పంపించాలి. సెప్టెంబర్ 15 చివరి గడువుగా నిర్ధారించింది. ప్రింటెడ్ పత్రాలను సెప్టెంబర్ 19న డీఈఓ కార్యాలయంలో సమర్పించాలి. డిసెంబర్ – 3న పరీక్ష ఉంటుంది. ప్రతి విద్యార్థి పరీక్ష ఫీజు కింద రూ.100 ఎస్‌బీఐ చలానా రూపంలో సంబంధిత ధ్రువపత్రాలతో పాటు జత చేయాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థు మాత్రం రూ.50లు ఫీజు చెల్లించాలి.



ఈ అర్హతలు తప్పనిసరి

ప్రభుత్వ, ఎయిడెడ్, స్థానిక సంస్థల పాఠశాలల్లో రెగ్యులర్ విధానంలో చదివే విద్యార్థులు ఈ ప్రోత్సాహకాలకు అర్హులు. ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి. తుది ఎంపిక సమయం నాటికి 8వ తరగతిలో 55 శాతం మార్కులు పొందాలి. కుటుంబ వార్షికాదాయం ఏడాదికి రూ.3,50,000 మించకూడదు. ఎన్ఎంఎంఎస్ రాత పరీక్ష ద్వారా విద్యార్థులను స్కాలర్‌షిప్‌లకు ఎంపిక చేస్తారు.

పరీక్ష విధానం ఇలా..

అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో పరీక్షను నిర్వహిస్తారు. ఈ పరీక్ష అబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లుగా ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్), స్కొలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(సాట్).. ఇలా రెండు పేపర్లు కలిపి 180 ప్రశ్నలకు 180 మార్కులుంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు ఉంటుంది. మ్యాట్ పేపర్‌లో మూడు విభాగాల నుంచి 90 ప్రశ్నలను అడుగుతారు. మెంటల్ ఎబిలిటీ–45 ప్రశ్నలు, ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ – 20 ప్రశ్నలు, హిందీ ప్రొఫిషియన్సీ నుంచి 25 చొప్పున ప్రశ్నలను ఇస్తారు. సాట్ పేపర్‌లో కూడా మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 90 ప్రశ్నలుంటాయి. ఇందులో సైన్స్ – 35 ప్రశ్నలు, సోషల్ స్టడీస్–35, మ్యాథమెటిక్స్ విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలను అడుగుతారు.

ఎన్ఎంఎంఎస్ సమాచారం ఇలా..

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత ప్రధానోపాధ్యాయుల ద్వారా దరఖాస్తు చేయడానికి చివరి తేదీ: **15.09.2023**

దరఖాస్తు ఫారాలు, ధ్రువపత్రాలను డీఈఓ కార్యాలయంలో అందజేసేందుకు చివరి తేదీ: **19.09.2023,**

డీఈఓ లాగిన్లో ఆమోదం పొందేందుకు చివరి తేదీ: 22.09. 2023

వెబ్‌సైట్ హెచ్‌టీటీపీ://బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

పచ్చ పార్టీలో రచ్చ రచ్చ...

తెలుగుదేశం పార్టీలో అంతర్గత కుమ్ములాటలు మరింత తీవ్రమయ్యాయి. ఇటీవల ప్రాజెక్టుల పరిశీలన పేరిట ఈ ప్రాంతానికి వచ్చిన ఆ పార్టీ అధినేత చంద్రబాబు పర్యటన తరువాత ఇవి మరింత ముదిరి పాకాన పడ్డాయి. చివరకు ఎక్కడ వరకు వెళ్లాయంటే...పార్వతీపురం ఇన్‌చార్జిగా విజయచంద్ర నియామకంపై ఆ పార్టీ నేతలే బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఈ నియామకంతో పార్టీ మరింత పతనం కావడం ఖాయమని ఆ పార్టీ నాయకులే బహిరంగంగా చెబుతుండడం విశేషం.

- పార్వతీపురం టీడీపీలో కల్లోలం
- జిల్లా కేంద్రంలో తార స్థాయికి చేరిన టీడీపీ వర్గ పోరు
- వివాదానికి కారణమైన నూతన ఇన్‌చార్జి నియామకం



పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ మూడు ముక్కలాట కొనసాగుతుంది. ఇటీవల కాలంలో తెలుగుదేశం పార్టీ పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జిగా బోనెల విజయచంద్రను అధిష్టానం నియమించింది. ఈయనకు అండగా ఉండాలన్న విషయం స్వయానా ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పార్వతీపురంలో ఇటీవల నిర్వహించిన బహిరంగ సభలో చెప్పినా ఆయనను వ్యతిరేకించే వర్గాలు మూడు ఏర్పడ్డాయని నియోజకవర్గం అంతా గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానిక తెలుగుదేశం పార్టీ పరిస్థితి, కష్ట కాలంలో పార్టీని గుప్పిట్లో పెట్టుకుని కేడర్ చేజారిపోకుండా చుట్టూ రక్షణ కవచంలా కాపాడిన నాయకులను పక్కన పెట్టి, ఇప్పుడు తెలియని అభ్యర్థిని తెచ్చి ఇతనే మొనగాడు అంటే తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. అధినేత మాటను ధిక్కరించలేక తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు. విశాఖలో ఉంటూ ఎప్పుడు పార్వతీపురం ముఖం చూడని ఎవరికీ తెలియని బోనెల విజయచంద్రను పార్టీ ఇన్‌చార్జిగా నియమించడంపై పార్టీ పరిస్థితి మరింత దిగజారుతుందేమోనన్న ఆందోళన క్యాడర్‌లో స్పష్టంగా కనిపిస్తుంది.

బోనెలపైనా విమర్శలు

మాదిగ జాతి ముసుగులో మా జాతిని మోసం చేసి సంపాదించిన డబ్బులతో రాజ్యాధికారం కోసం బోనెల విజయచంద్ర ఆరాట పడుతున్నాడని ఇన్ఫాం ఇంటర్నేషనల్ అధ్యక్షుడు గెద్దం బాపిరాజు నాలుగు రోజుల కిందట మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఎన్నో అక్రమాలకు పాల్పడిన విజయచంద్ర చరిత్ర తెలుసుకోకుండా పార్వతీపురం టీడీపీ ఇన్‌చార్జిగా ఎలా నియమించారని ప్రశ్నించారు. 2014లో ఏర్పడిన ఐఎఫ్ఎం (ఇంటలెక్చువల్ ఫొరం ఫర్ మాదిగాస్) అనే సంస్థ మాదిగ జాతి కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. 2018లో ఆ సంస్థ చేసిన కార్యక్రమాలు చూసే ఇన్ఫాంలోకి వచ్చిన బోనెల విజయచంద్ర ఈ సంస్థలో ఉన్న కొంత మంది ఐఏఎస్, ఐపీఎస్ మేధావులను పక్కదారి పట్టించారన్నారు. ఇదే సంస్థ పేరు మీద కార్యవర్గ సభ్యులు ఎవరూ లేకుండా వైజాగ్‌లోని గీతం యూనివర్సిటీలో కెనరా బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసి ఆర్థిక నేరాలకు పాల్పడ్డారన్నారు. దేశం టీవీలో విజయచంద్ర డైరెక్టర్‌గా జాయిన్ అయ్యి రూ.నాలుగు కోట్లు వసూలు చేసి సంస్థకి ఇవ్వలేదని, ఆ డబ్బులు ఏమయ్యాయో తెలియక దేశం టీవీ నడుపుతున్న శ్రీనివాసరావు చనిపోయారన్నారు. బోనెల విజయచంద్రకు టీడీపీ ఇన్‌చార్జిగా ఎలా నియమించిందో అర్థం కావడం లేదని ఆయన మీడియా సమావేశంలో పేర్కొన్నారు.

అధినేతపై సొంత పార్టీ వారే బహిరంగ విమర్శలు

తెలుగుదేశం పార్టీలో ఈ మధ్య జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే పార్టీకి భవిష్యత్తు ఉండదన్నారు ఆ పార్టీ అరుకు పార్లమెంటరీ ఎస్సీ అధికార ప్రతినిధి గర్భాపు ఉదయభాను. ఆయన చంద్రబాబుపై బహిరంగ విమర్శలు చేశారు. పార్టీ కోసం గత ఐదు సంవత్సరాలుగా పని చేస్తూ పార్టీ ఉనికి చాటుతూ పార్టీ కోసం శ్రమిస్తూ అన్ని విధాలా పని చేస్తున్నప్పటికీ మాలాంటి నాయకులకు గౌరవం దక్కడం లేదన్నారు. ఇటీవల ఏ సర్వే ప్రకారం పార్వతీపురం నియోజకవర్గానికి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జిని నియమించావు.. సర్వేలో అన్నింటిలో కూడా నేను ముందంజలో ఉంటుండగా ఆ సర్వేలను కాదని ఏ లాలూచీతో విజయచంద్రను నియమించావని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ ఉనికి కోల్పోయిన రోజుల్లో 2019లో పార్టీని ఎవరూ పట్టించుకోని పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చినపుడు సర్పంచ్ అభ్యర్థులకు, ఎంపీటీసీ అభ్యర్థులకు చేతనైన ఆర్థిక సాయాన్ని చేసి నేనున్నానంటూ భరోసా కల్పించానన్నారు. నాకు కనీసం సమాచా రం లేకుండా వేరే వ్యక్తిని ఎలా నియమించావని ప్రశ్నించారు.

అ'పూర్వ' కలయిక

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల పట్టణంలోని సీకేఎం ప్రభుత్వ కళాశాలలో 1992 – 93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం అపూర్వ రీతిలో జరిగింది. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వీరంతా తమ కుటుంబ సభ్యులతో కలసి సందడి చేశారు. మూడు దశాబ్దాల తరువాత అంతా ఒకే చోట కలుసుకున్న వీరంతా అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మధుర క్షణాలను ఆస్వాదించారు. రోజంతా ఆటపాటలతో గడిపారు. పూర్వ విద్యార్థులు ఉమా మహేశ్వరరాజు, ఎస్.రఘు, చిరంజీవి, చంద్రశేఖర్, తాలాడ మహేష్, బుజ్జి ఈ కార్యక్రమానికి సారధ్యం వహించారు.



నెల్లిమర్ల సీకేఎం ప్రభుత్వ కళాశాల 1992 - 93 బ్యాచ్ విద్యార్థులు

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం


చందక రామారావు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు ఆదివారం ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చందక రామారావు ఈ నెల 12న విజయనగరం ఆస్పత్రికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లాడు. ఇంతవరకూ ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇళ్లలోనూ, వివిధ ప్రాంతాల్లోనూ వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో నెల్లిమర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా అప్పలనాయుడు

విజయనగరం క్రైమ్: ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎ.అప్పలనాయుడిని ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా ప్రతినిధులు ఆదివారం తెలిపారు. ఎంపికైన అప్పలనాయుడు మూడేళ్ల పాటు పదవిలో కొనసాగుతారన్నారు. ఎన్నికల అధికారులుగా కె.చిరంజీవి, కేవీ.రమణమూర్తి వ్యవహరించారు. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొండయ్య, గౌరవ సలహాదారు యండమూరి నాగరాజు తదితరులు నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపారు.


భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

బొబ్బిలి: పట్టణంలోని పాత కోర్టు భవనం ఎదురుగా ఉన్న సామిల్లులో పనిచేస్తున్న శ్రీకాకుళం జిల్లా పాలవలసకు చెందిన దుమ్ము దుర్వాసులు(58) నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందినట్లు ఎస్సై చదలవాడ సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. దుర్వాసులు ఎనిమిది నెలలుగా ఇక్కడ పనిచేస్తూ సహచరులతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి గాలికోసం సమీపంలో గల నిర్మాణ భవనంపైకి వెళ్లగా ప్రమాదవశాత్తు తూలి కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. మృతుడికి భార్య కృష్ణవేణి ముగ్గురు మగ పిల్లలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు, మరో ఇద్దరికి స్వల్ప గాయాలు


వెదుళ్లనరవ సమీపంలో ఒక దాన్ని మరొకటి ఢీకొన్న ఆటో,ఆర్టీసీ బస్సులు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

సబ్బవరం: మండలంలోని వెదుళ్లనరవ సమీపంలో అల్లిమెట్ట మలుపు వద్ద ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకున్న ఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలు కాగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బొండపల్లి మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన వర్రి గోపాలం(35),చల్లా శ్రీను(35),అల్లు సూరిసత్యం(52),వేమలి కృష్ణమ్మ ఆదివారం ఉదయం దువ్వాడలోని తమ బంధువుల ఇంటికి ఆటోలో శుభకార్యానికి వచ్చారు. తిరిగి స్వగ్రామం వెళ్తుండగా వెదుళ్లనరవ సమీపంలోని అల్లిమెట్ట మలుపు వద్దకు వచ్చే సరికి చోడవరం నుంచి గాజువాక వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో వెనుక కూర్చున్న నలుగురిలో వర్రి గోపాలం,అల్లు సూరిసత్యం తలలకు తీవ్రగాయాలు కాగా మిగిలిన ఇద్దరికీ స్వల్పగాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను స్థానికులు దువ్వాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	60,380-00
బంగారం(22కి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రస్డ్	స్కిన్‌లెస్
₹128	₹226	₹ 236

వర్ధమాన క్రికెటర్లకు ఏపీఎల్ తొలిమెట్టు

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు
- అవకాశాలను అందిపుచ్చుకోవాలి: సెట్విజ్ సీఈవో రాంగోపాల్
- ఉత్సాహంగా 3కె రన్


క్రీడాజ్యోతిని వెలిగించి 3కె రన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజు, కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్‌లు

విజయనగరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి 27 వరకు విశాఖలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి క్రికెట్ మైదానంలో నిర్వహించే ఆంధ్ర ప్రీమియర్ లీగ్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం చేయడంలో ప్రజలు, క్రీడాకారులు, క్రీడాభిమానులు సహకరించాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు కోరారు. ఏపీఎల్ సీజన్-2 ప్రారంభోత్సవంలో భాగంగా జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక విజ్జీస్టేడియం నుంచి కోట జంక్షన్ వరకు మన ఆంధ్రా- మన ఏపీఎల్ నినాదంతో 3కె రన్ నిర్వహించారు. ఈ రన్‌ను స్థానిక విజ్జీ స్టేడియంలో ఎంఎల్ఎన్ రాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జి.ఈశ్వర్ కౌశిక్, సెట్విజ్ సీఈఓ. బి.రామ్ గోపాల్‌లు క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. అనంతరం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ఎన్ రాజు మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో నిర్వహించే ఈ టోర్నీ జిల్లా క్రికెట్ క్రీడాకారులకు వరమని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఎంతోమంది చిన్నారులు క్రికెట్‌లో రాణించడానికి ఉపయోగపడుతుందని ఉద్ఘాటించారు. 12 రోజుల పాటు నిర్వహించే ఏపీఎల్ చూసేందుకు ఉచితంగా ప్రవేశం కల్పించేందుకు ఈ అవకాశాన్ని క్రీడాకారులు, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ మాట్లాడుతూ దేశంలో నిర్వహిస్తోన్న ఇండియన్ ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నీ ఎంతోమంది క్రికెటర్లను వెలుగులోకి తీసుకువస్తుందని ఇదే తరహాలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్వహించే ఏపీఎల్ రాష్ట్ర క్రీడాకారులకు, జిల్లా క్రికెటర్లకు తొలి మెట్టుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా క్రికెటర్లు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వర్ధమాన క్రికెటర్లకు ఐపీఎల్ రాజమార్గమని దానిని సద్వినియోగం చేసుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సెట్విజ్ సీఈవో రామ్ గోపాల్ సూచించారు.


రన్‌లో పాల్గొన్న క్రీడాకారులు, అసోసియేషన్ ప్రతినిధులు

క్రికెట్‌కు ప్రభుత్వం ప్రాముఖ్యం

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద ముగిసిన మన ఆంధ్ర మన ఏపీఎల్ 3కె రన్ ముగింపు కార్యక్రమానికి హాజరైన సెట్విజ్ సీఈఓ. క్రికెట్ క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రికెట్ అభివృద్ధికి అధిక ప్రాముఖ్యం ఇస్తుందని అలాగే ఐపీఎల్‌లో రాష్ట్ర జట్టు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ చైర్మన్ సన్యాసి రాజు, సెలక్టర్లు బంగార్రాజు, ఎంఎస్ఎన్ వర్మ, ఎంసీఏ కోచ్ రతన్, కోచ్‌లు సురేంద్ర, రమేష్, చంద్రశేఖర్, సీనియర్ క్రీడాకారులు తపస్వి, పృథ్వీరాజ్ ఇతర క్రీడాకారులు పాల్గొన్నారు.

కలకలం రేపిన విద్యార్థినుల అదృశ్యం

- పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆచూకీ లభ్యం
- విచారణ చేసిన డీఈఓ


కేజీబీవీలో విచారణ చేస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్, సిబ్బంది

సీతంపేట: స్థానిక కేజీబీవీలో ఇంటర్మీడియట్ ఒకేషనల్ గ్రూప్ ఎంపీహెచ్‌డబ్ల్యూ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు శనివారం రాత్రి అదృశ్యం కావడం కలకలం రేపింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి ఆచూకీ కనుగొనడంతో అధికారులు, సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. ఇందుకు సంబంధించి సమాచారం అందడంతో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈవో) నిమ్మక ప్రేమ్‌కుమార్, సూపరెంటెండెంట్ రంగాచారి, డిప్యూటీఈవో విజయకుమారి, జీసీడీవో రోజారమణి, ఎంఈవో-2 సూర్యచంద్రరావులు వెంటనే కేజీబీవీని ఆదివారం సందర్శించి సుదీర్ఘ విచారణ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ అదృశ్యమైన విద్యార్థినుల్లో ఒకరికి జన్మదినం కావడంతో వారి బంధువులు శనివారం ఉదయం కేక్, స్వీట్లు తెచ్చి ఇచ్చేసి వెళ్లిపోయారు. శనివారం రాత్రి బర్త్‌డే జరుపుకుని రోల్‌కాల్ వరకు ఉన్న విద్యార్థినులు వాష్‌రూమ్‌కు వెళ్తామని చెప్పి పాఠశాల నుంచి వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం వారిద్దరూ పాఠశాలలో లేకపోవడంతో ప్రిన్సిపాల్ రూప అధికారులకు సమాచారమిచ్చారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు వీరఘట్టం ఎస్సై వెంకటరమణ, స్థానిక ఏఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చేపట్టి విద్యార్థినుల ఆచూకీ కనుగొన్నారు. వారిద్దరూ కేజీబీవీ సమీపంలో ఉన్న ఒక అమ్మాయి ఇంటివద్ద ఉన్నారు. దీంతో వారిని పోలీసులు తీసుకువచ్చి విద్యాశాఖాధికారులు, కేజీబీవీ సిబ్బంది సమక్షంలో పేరెంట్స్‌కు అప్పగించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేజీబీవీలు అంటే క్రమశిక్షణకు నిలయాలని ఇటువంటి విద్యాసంస్థలో ఎవ్వరికీ చెప్పకుండా విద్యార్థినులు బయటకు వెళ్లారంటే సిబ్బంది బాధ్యతా రాహిత్యం స్పష్టంగా కనిపిస్తోందని అసహనం వ్యక్తం చేశారు.

హైరిస్క్ గర్భిణులకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు..

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం


వాహనంలో ఇంటికి వెళ్తున్న తల్లీబిడ్డలు

విజయనగరం ఫోర్ట్: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా ఇక నుంచి హెచ్ఆర్‌పీ(హైరిస్క్ గర్భిణి)లను ఆస్పత్రికి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి చేరుస్తారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫోన్ చేసిన 48 గంటలలోగా గర్భిణిని ఆస్పత్రిలో చేర్చుతారు. అదేవిధంగా తీవ్ర రక్త హీనత ఉన్న గర్భిణులు రక్తం ఎక్కించుకోవడానికి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను వినియోగించుకోవచ్చు. ఆస్పత్రికి చేర్చడంతో పాటు తిరిగి ఇంటికి చేర్చుతారు. ఫోన్‌చేసిన 24 గంటల లోగా ఆస్పత్రికి చేర్చుతారు.

ప్రభుత్వ ఉత్తర్వులు అమలు

> తీవ్ర రక్తహీనత, హైరిస్క్ ఉన్న గర్భిణులను ఆస్పత్రికి చేర్చాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. వెంటనే ఆదేశాలను అమలు చేస్తాం. గర్భిణులను ఆస్పత్రికి చేర్చడం కోసం ఫోన్ 6300357573 నంబర్‌ను సంప్రదించాలి.
> వరుణ్ వర్మ, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ జిల్లా మేనేజర్

జిల్లాలో 22 వాహనాలు

విజయనగరం జిల్లాలో 22 తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్ వాహనాలు ఉన్నాయి. వాటిలో ఘోషా ఆస్పత్రి పరిధిలో 11, చీపురుపల్లి 2, బొబ్బిలి సీహెచ్‌సీలో 2, గజపతినగరం సీహెచ్‌సీ1, రాజాం సీహెచ్‌సీ 1, భోగాపురం 1,బాడంగి సీహెచ్‌సీ 1, రామభద్రపురం పీహెచ్‌సీ 1, ఎస్.కోట సీహెచ్‌సీ 1, ఎల్.కోట పీహెచ్‌సీ 1 వాహనం సేవలు అందిస్తున్నాయి.

లైసెన్స్ లేకుండా ఎరువుల విక్రయం నేరం

- నిందితులపై 6ఎ కేసు నమోదు
- జిల్లా వ్యవసాయ అధికారి తారకరామారావు


జిల్లా వ్యవసాయాధికారి రామారావు

విజయనగరం ఫోర్ట్: లైసెన్స్ లేకుండా విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించిన వారిపై 6ఎ కేసు నమోదు చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు హెచ్చరించారు. అన్ని అనుమతులు ఉన్న వారు మాత్రమే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. లైసెన్స్ లేకుండా పట్టుబడిన విత్తనాలు, ఎరువుల విలువ రూ. 5 లక్షల లోపు అయితే జేసీ కోర్టులో కేసు నమోదు చేస్తామని చెప్పారు. రూ.5లక్షలు దాటితే కోర్టులో కేసు పెడతామన్నారు. అదే విధంగా పురుగు మందులు లైసెన్స్ లేకుండా విక్రయిస్తూ పట్టుబడితే వస్తువు విలువ ఎంతైనా కోర్టులో కేసు నమోదు చేస్తామన్నారు. జిల్లాలో విత్తన షాపులు 195 ఉన్నాయని, ఎరువుల షాపులు 210 ఉన్నాయని, పురుగు మందుల దుకాణాలు 270 ఉన్నాయని తెలిపారు.

బిల్డింగ్ పైనుంచి పడి భవన నిర్మాణ కార్మికుడి మృతి


మృతుడు పాకిరి నాయుడు

కూర్మన్నపాలెం: నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌పై నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం కింతలవానిపేట గ్రామానికి చెందిన పాకిరి నాయుడు(45) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. భార్య రమణమ్మ, కూతురు సీతామహాలక్ష్మి, అల్లుడు ఉమాశంకర్‌తో కలిసి కూర్మన్నపాలెంలోని కాశీపాలెంలో నివాసముంటున్నాడు. ఆదివారం కూర్మన్నపాలెం పరిధి వుడా ఫేస్-7 ద్వారకపూరికాలనీలో గల గ్లోరియా స్కూల్ పక్కన ఓ ఇంటి నిర్మాణ పనుల్లో భాగంగా లిఫ్ట్‌లో మెటీరియల్‌ను తీసుకువెళ్తున్న క్రమంలో 3వ ఫ్లోర్ పై నుంచి జారి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ


అర్ధరాత్రి డిపో వద్ద బాధితులకు నగదు, బ్యాగ్ అప్పగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, అధికారులు

పాలకొండ రూరల్: పట్టణంలోని కొత్తవీధికి చెందిన పి.దుర్గమ్మ తండ్రితో కలిసి రాజాం నుంచి శనివారం రాత్రి ఆర్టీసీ బస్సులో పాలకొండకు వస్తూ నగదు రూ.24 వేలతో కూడిన బ్యాగ్ బస్సులో పొరపాటున విడిచిపెట్టి బస్సు దిగిపోయింది. ప్రయాణికులందరూ బస్సు దిగిపోయిన అనంతరం డ్రైవర్ జీడీ రావు వాహనంతో స్థానిక డిపోకు వెళ్లిపోయారు. విధులు ముగించే సమయంలో బస్సులో ఉన్న బ్యాగ్‌ను ఆయన గుర్తించి డిపో సెక్యూరిటీకి అప్పగించాడు. బాధితురాలు తన తండ్రితో కలిసి అర్ధరాత్రి డిపోకు చేరుకుని బస్సులో బ్యాగ్ విడిచిపెట్టి దిగిపోయినట్లు అధికారులకు చెప్పగా వారి వద్ద ఉన్న బస్ టికెట్ ఆధారంగా బాధితులను సిబ్బంది గుర్తించారు. డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు, సహాయ మేనేజర్ ఎస్.లక్ష్మణరావు, సెక్యూరిటీ అధికారి టి.రాము, కంట్రోలర్ మజ్జి కృష్ణారావుల సమక్షంలో బాధితులకు బ్యాగ్ అందించారు. నిజాయితీగా వ్యవహరించిన డ్రైవర్‌ను ఆర్టీసీ యాజమాన్యం అభినందించింది.

సీఏ, సీఎంఏ ఫౌండేషన్ ఫలితాల్లో జిల్లా విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న ఆర్ఎస్ అకాడమీ డైరెక్టర్ రమేష్

విజయనగరం అర్బన్: ఆల్ ఇండియా స్థాయిలో జూన్‌లో నిర్వహించిన సీఏ, సీఎంఏ ఫౌండేషన్ పరీక్ష ఫలితాల్లో ఉమ్మడి విజయనగరం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. పట్టణానికి చెందిన ఆర్ఎస్ అకాడమీ విద్యార్థులు తొలి ప్రయత్నంలోనే రెండింటిలోనూ రాణించారు. నగరానికి చెందిన కె. నందిని ప్రియ సీఎంఏ ఫౌండేషన్‌లో 400కు గాను 342 మార్కులు, సీఏ ఫౌండేషన్‌లో 252 మార్కులు.. పి.శ్రీపూజి సీఎంఏ ఫౌండేషన్‌లో 332, సీఏ ఫౌండేషన్‌లో 244 మార్కులు.. జె.సుజాత సీఎంఏ ఫౌండేషన్‌లో 308, సీఏ ఫౌండేషన్‌లో 239 మార్కులు సాధించారు. అదేవిధంగా కె.చంద్రశేఖర్ సీఎంఏ ఫౌండేషన్‌లో 288, సీఏ ఫౌండేషన్‌లో 276.. వి.సంజన సీఏ ఫౌండేషన్‌లో 237 మార్కులు సాధించారని అకాడమీ డైరెక్టర్ ఎ. రమేష్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు.

ఐటీఐ ప్రిన్సిపాల్ మానవత్వం

- గాయపడిన మహిళను ఆస్పత్రికి కారులో తరలింపు



గాయపడిన మహిళను కారులో ఆస్పత్రికి తీసుకువెళ్తున్న ప్రిన్సిపాల్ టీవీ గిరి, (ఇన్‌సెట్లో) ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

విజయనగరం రూరల్: ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను వెనువెంటనే తన కారులో ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రాణాలు కాపాడిన విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి తన మానవత్వం చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో విజయనగరం, విశాఖరోడ్డు రఘు ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఐదుగురు బ్యాంకు ఉద్యోగులు నడుచుకుంటూ వెళ్తున్నారు. అయితే వారిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒక మహిళ తలకు బలమైన గాయం తగిలి అపస్మారక స్థితికి చేరుకుంది. అదే సమయంలో విశాఖపట్నానికి కారులో వెళ్తున్న విజయనగరం ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి క్షణం ఆలస్యం చేయకుండా ప్రమాదానికి గురైన మహిళను, సహోద్యోగుల సహాయంతో తగరపువలస సమీపంలోని ఎస్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆమెకు చికిత్స చేసి ప్రాణాలు నిలిపారు. ఏమాత్రం ఆలస్యమైనా ప్రాణాలు దక్కేవి కాదని వైద్యులు చెప్పినట్లు ప్రిన్సిపాల్ టీవీ గిరి ఈ సందర్భంగా తెలిపారు. మూడేళ్ల క్రితం తన భార్య, కుమార్తె రోడ్డు ప్రమాదంలో మరణించారని, అలా మరొకరికి జరగకుండా ప్రమాదాన్ని నివారించగలిగానన్నారు. ప్రమాద విషయమై పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు.

బెదిరించి..భయపెట్టి..దోపిడీ

విజయనగరం క్రైమ్: దోపిడీలు, దొంగతనాలు కొత్త పుంతలు సంతరించుకుంటున్నాయి. చీకటి ప్రదేశంలో అదునుచూసి బెదిరించి, కత్తులు చూపించి భయపెట్టి అమాయకులను కొట్టి వారి నుంచి డబ్బులు లాక్కుంటున్నారు. టూటౌన్ పరిధిలో ఈ తరహా ఘటనలు ఆదివారం రెండు జరిగాయి. కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అవుతున్న రాకేష్, శివాజీలు స్టడీ అవర్స్ అయిన తర్వాత శనివారం రాత్రి తమ రూమ్‌కు నడుచుకుని వెళ్తున్నారు. అదును చూసిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి వారితో తగాదా పెట్టుకుని, డబ్బులు, మొబైల్స్ లాక్కుని పారిపోయారు. బాధితులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించగా కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రసన్న తెలిపారు. అలాగే వెటర్నరీ కోర్సు సెకెండ్ ఇయర్ చదువుతున్న బాలిరాజు స్నేహితుడితో కలిసి రాత్రి 9 గంటల ప్రాంతంలో బైక్‌పై అయోధ్యా మైదానంవైపు వెళ్తుండగా ఇద్దరు వ్యక్తులు ఆపి డబ్బులు డిమాండ్ చేశారు. కత్తులు చూపించి బెదిరించి వారిని పూల్‌బాగ్ వరకూ తీసుకువెళ్లారు. అక్కడ ముందుగానే ఉన్న నిందితుల సహచరులు బాలిరాజు, స్నేహితుడిని చితక్కొట్టి చంపేస్తామని బెదిరించి వెయ్యిరూపాయలు, రెండు సెల్‌ఫోన్లు, బైక్ కీ తీసుకుని పారిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ కేసు నమోదుచేసి నిందితులు బత్తు, జగదీష్‌లను అరెస్టు చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆర్టీసీలో అప్రెంటిస్

- 9 జిల్లాల పరిధిలో ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అవకాశం
- 18 ట్రేడ్స్‌లో శిక్షణ
- 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరణ
- 18 నుంచి 21వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీన



ఆర్టీసీ వర్క్‌షాప్ గ్యారేజ్

విజయనగరం అర్బన్: సాంకేతిక (ఐటీఐ) విద్యార్హతతో అప్రెంటిస్ శిక్షణ అందించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ఆర్టీసీ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ మేరకు జోనల్ వర్క్‌షాప్‌లోని స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.హిమబిందు ఒక ప్రకటన విడుదల చేశారు. విజయనగరం జోన్ పరిధిలోని విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు నాప్ పథకం నిబంధనల మేరకు అప్రెంటిస్‌షిప్ ఇస్తారు. ప్రధానంగా డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్‌మెట్ వర్కర్, పెయింటర్, మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, మిల్ రైట్ మెకానిక్ (మెకానిక్/మెకానికల్ మెయింటనెన్స్) కోర్సుల ఐటీఐ అభ్యర్థులకు మాత్రమే అప్రెంటిస్ షిప్ ప్రకటించారు. 'అప్రెంటిస్‌షిప్ ఇండియా.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్‌లో పేర్లను ఈ నెల 15వ తేదీ లోగా నమోదు చేసుకున్న అర్హులైన అభ్యర్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు. ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం ఆన్‌లైన్‌లో నమోదైన అభ్యర్థులను జిల్లాల వారీగా పిలుస్తారు. ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు ఆయా జిల్లాల అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన స్థానిక ఇండస్ట్రియల్ ఏరియాలోని ఆర్టీసీ జోనల్ స్టాఫ్ శిక్షణ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తారు. ఆయా జిల్లాలకు కేటాయించిన తేదీలలో ఉదయం 10 గంటలకు హాజరు కావాలి.

పరిశీలనకు తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు

ఆన్‌లైన్‌లో నమోదైన రిజిస్ట్రేషన్ ఫారం, ఎస్ఎస్‌సీ మార్క్స్ లిస్టు, ఐటీఐ మార్క్స్ లిస్టు, కుల ధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ, బీసీలు) మండల కార్యాలయం నుంచి పొందిన నివాస ధ్రువీకరణ పత్రం, ఎన్‌సీసీ/స్పోర్ట్స్, ఆధార్ కార్డు, పీహెచ్‌సీ సర్టిఫికెట్, బయోడేటా ఫారం, ఎక్స్‌సర్వీస్‌మన్ ధ్రువీకరణ పత్రం, సొంత అడ్రస్ రూ.25 విలువగ స్టాంప్ అతికించిన కవర్ తీసుకువెళ్లాలి. సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో ఒక సెట్ జిరాక్స్ కాపీలను కూడా తీసుకెళ్లాలి. ఒక జిల్లాలో సంబంధిత ట్రేడ్‌లో ఖాళీలు లేని పక్షంలో వేరే జిల్లాలో పనిచేసేందుకు అంగీకార పత్రం సర్టిఫికెట్ల పరిశీలన సమయంలో రాసి ఇవ్వాలి. ప్రాసెసింగ్ ఫీ నిమిత్తం రూ.118 చెల్లించి రసీదు పొంది దరఖాస్తుతో జతపరచాలి. పూర్తి వివరాల కోసం సమీప ప్రభుత్వ ఐటీఐ కళాలలోగానీ, 08922-294906 నంబర్‌లో గానీ సంప్రదించాలి.

సర్టిఫికెట్ల పరిశీలన జిల్లాల వారీగా

ఈ నెల 18న తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల అభ్యర్థులకు పరిశీలన ఉంటుంది. 19న విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు, 21న శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల అభ్యర్థులకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది.

ఖాళీగా ఉన్న అప్రెంటిస్ షిప్ కోర్సులు .:

విజయనగరం జిల్లాలో: డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మిల్ రైట్ మెకానిక్ (మెకానిక్/ మెకానికల్ మెయింటనెన్స్), మెషినిస్ట్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్'మెన్ సివిల్, **శ్రీకాకుళం జిల్లా:** డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్ మెటల్ వర్కర్

పార్వతీపురం మన్యం జిల్లా: డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, షీట్‌మెటల్ వర్కర్

అల్లూరి సీతారామరాజు జిల్లా: డీజిల్ మెకానిక్

తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ, అనకాపల్లి జిల్లాలలో డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్ ట్రేడ్స్ ఉన్నాయి.